క్లుప్తంగా

ప్రజలకు మేయర్ క్రిస్మస్ శుభాకాంక్షలు



నెహ్రూ నగర్: గుంటూరు నగర ప్రజలకు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవులంతా క్రిస్మస్ పండుగ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. క్రిస్మస్ క్రైస్తవుల జీవితంలో సంతోషాన్ని నింపాలని, వారి ఇంట ఆనందపు కాంతులు వెదజల్లాలని కోరారు.

ఈఎన్‌టీ సమస్యలపై అశ్రద్ధ వద్దు



లక్ష్మీపురం: చెవి, ముక్కు, గొంతు సంబంధించిన సమస్యలపై అశ్రద్ధ చేయవద్దని సీనియర్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ భయ్యా సుధీర్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ తరుచుగా వచ్చే తలనొప్పి, చెవిపోటు, జలుబు, తుమ్ములు, గొంతు నొప్పులు లోపల నిఘాడంగా ఉన్న తీవ్ర వ్యాధులకు లక్షణాలు కావచ్చన్నారు. ఇవి తరుచుగా వస్తుంటే అశ్రద్ధతో తాత్కాలిక ఉపశమనాల కోసం ప్రయత్నించక రోగ నిర్ధారణ కోసం ఈఎన్‌టీ నిపుణులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భయ్యా సుధీర్ ఘనంగా సత్కరించారు.

అబాకస్‌లో భారతీయ విద్యాభవన్ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో ఈనెల 22న ఏటీ అగ్రహారంలోని సెంట్రల్ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన జోనల్ స్థాయి అబాకస్ పోటీల్లో భారతీయ విద్యాభవన్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ హేమాంబ తెలిపారు. మంగళవారం కలెక్టర్‌బంగ్లారోడ్డులోని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అబాకస్ పోటీల్లో ప్రథమ బహుమతి కైవసం చేసుకున్న 5వ తరగతి విద్యార్థి జి.కిషోర్‌కుమార్, ద్వితీయ బహుమతులు సాధించిన మూడు, ఆరు తరగతుల విద్యార్థులు వేదాన్ష్, కె.కార్తికేయతో పాటు కన్సోలేషన్ బహుమతి పొందిన దేవాన్ష్‌ను పాఠశాల ప్రధాన కార్యదర్శి పి. రామచంద్రరాజు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణ ఉషశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలో లాస్య ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వెంగళరావునగర్‌లోని నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాల ఆరో తరగతి విద్యార్థిని మేడిద లాస్య తృతీయ స్థానం సాధించింది. మంగళవారం కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ చేతుల మీదుగా విద్యార్థిని లాస్య రూ.1,500 నగదుతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రమేష్ తెలిపారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ వీర్ల త్రివేణి మాట్లాడుతూ బాలికల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన పాఠశాలలో తమ పిల్లలు అత్యుత్తమ విద్య అభ్యసిస్తున్నారని తెలిపారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు విద్యార్థిని లాస్యతో పాటు సాంఘికశాస్త్ర ఉపాధ్యాయిని దుర్గా మహేశ్వరి. ఎం.రాములును అభినందించారు.

కొనసాగిన తిరుప్పావై తొమ్మిదోవ పాశురంపై ప్రవచనం



మాట్లాడుతున్న వెంకటశ్రీరంగనాయికి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం తిరుప్పావై 9వ పాశురంపై ప్రవచనం జరిగింది. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభిం చారు. తిరుప్పావై అమృతవర్షిణి డాక్టర్ కోగంటి వెంకట శ్రీరంగనాయికి ప్రసంగిస్తూ శ్రవణం, మననం వల్ల మనోమాలిన్యాల దోషాలు దూరమవుతాయని అన్నారు.









● ఆనందం.. మహదానందం



ఏసుక్రీస్తు జననం.. లోకానికే ఆనందం. నగరంలో క్రైస్తవులు సంబరాల్లో మునిగిపోయారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రార్థనలు చేశారు. క్రీస్తు జననం.. పశువుల పాక ఏర్పాటు చేశారు. అక్కడ కొవ్వొత్తులు వెలిగించారు. చిన్నారుల నుంచి పెద్దలకు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

ప్రత్తిపాడు వెలుగు కార్యాలయంలో విచారణ



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు వెలుగు కార్యాలయంలో డీఆర్‌డీఏ ఉన్నతాధికారులు విచారణ నిర్వహించారు. గొట్టిపాడులోని రాధాకృష్ణ గ్రామైఖ్య సంఘం వీఓఏను సభ్యులు, ఓబీ సభ్యులకు తెలియకుండా తొలగించి, కొత్త వారిని వీఓఏగా అక్రమంగా నియమించారని, అదేవిధంగా ఇదే గ్రామంలో మరో వీఓఏ అవినీతికి పాల్పడిందంటూ గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డీఆర్‌డీఏ పీడీ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ ఐబీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కామేశ్వరి, పొన్నూరు ఏపీఎం జోయబాబు మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో విచారణ నిర్వహించారు. వీఓఏ నియామకానికి సంబంధించిన తీర్మానాలు, సభ్యుల సంతకాలు, వీవోఏ అవినీతికి సంబంధించిన వివరాలు పరిశీలించారు.

నగరంలో వాన







నెహ్రూనగర్: అల్పపీడన ప్రభావంతో గుంటూరు నగరంలో ఉదయం నుంచి ఓ మోస్తరు వర్షం కురిచింది. క్రిస్మస్ పండుగ నేపథ్యంలో షాపింగ్ చేయాలనుకున్న క్రైస్తవులు వర్షంలోనే షాపింగ్ చేసుకున్నారు. రోడ్ల వెంట వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అల్పపీడనం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్న ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ సూచనల మేరకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వర్ష ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విభాగాదిపతులను ఆదేశించామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షం వలన నగర ప్రజలకు ఏ సమస్య ఎదురైనా తక్షణం స్పందించడానికి నగరపాలక సంస్థ అధికారులు సిద్ధంగా ఉండాలని కోరారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా, నిలిచిన ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన బెయిల్ అవుట్ చేసేలా మోటార్లను అందుబాటులో ఉంచుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను, చెట్ల కొమ్మలు పడిపోతే వెంటనే తొలగించేలా సామగ్రితో సిద్ధంగా ఉండాలని ఏడిహెచ్ ని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఏమైనా అంతరాయం ఏర్పడితే తాగునీటి సరఫరాలో సమస్య రాకుండా జనరేటర్లను అందుబాటులో ఉంచాలని, అవసరమైన సిబ్బందికి ముందుగానే విధులు కేటాయించాలని ఆదేశించారు. నగర ప్రజలు వర్ష ప్రభావంతో ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863–2345103 కి కాల్ చేయవచ్చని తెలిపారు.

'చాంబర్'లో కుదరని 'కూటమి'

- ఫలించని కూటమి ప్రయత్నాలు..
- గెలుపు కోసం నువ్వా.. నేనా అనే రీతిలో అభ్యర్థులు
- ఇతర జిల్లాలోని వ్యాపార ఓటర్లపై ప్రత్యేక దృష్టి

నగరంపాలెం: గుంటూరు జిన్నాటవర్ కూడలిలోని ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్(ఐసీసీ) ఎన్నికల ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఈనెల 18న నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. 23న ఉపసంహరణ గడువు ముగిసింది. 26న ఎవరెవరూ పోటీ చేయనున్నారనేది నోటీసు బోర్డులో ప్రకటించనున్నారు. 28న ఎన్నికలు నిర్వహించనున్నారు. చాంబర్ ఎన్నికల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈసారి కూటమి నాయకులే అధ్యక్ష పదవికి పోటీపడుతున్నారు. నువ్వా, నేనా అనే రీతిలో బరిలో ఉన్నారు. టీడీపీకి చెందిన వారే పోటీపడటంతో వ్యాపార ఓటర్లు మరింత ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అధ్యక్ష పదవి ఏకగ్రీవం చేసేందుకు కూటమి నేతలు చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కిరాలేదు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఓ ప్రజాప్రతినిధి వద్ద పంచాయితీ జరిగినట్లు సమాచారం. ఈసారికి అధ్యక్ష పదవి పోటీ నుంచి వైదొలగాలని బాలకృష్ణపై ఒత్తిడి తీసుకొచ్చారని తెలిసింది. అందుకు ఆయన ఓ హామీ ఇవ్వాలని పట్టుబడినట్లు సమాచారం. అయితే బాలకృష్ణకు హామీ ఇవ్వలేకపోవడంతో పోరు ఖాయమైంది. దీంతో అధ్యక్ష పదవి రేసులో ఉన్న యేల్చూరి వెంకటేశ్వర్లను గెలిపించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రంగా బాలకృష్ణ కూడా తన ప్రయత్నాలు విస్తృతంగా చేశారు. ప్రధానంగా పల్నాడు జిల్లాలోని వ్యాపార ఓటర్లపై ఎక్కువ దృష్టి సారించినట్లు తెలిసింది. ఈ క్రమంలో పల్నాడు వైపు పయనమయ్యారు. ఈ మేరకు అక్కడ వారి తో మంతనాలు జరుపుతున్నారు. అయితే గుంటూరులో ఓటర్లు ఆసక్తి ప్రదర్శించడం లేదు. 28న జరిగే ఎన్నికల్లో సాయంత్రంకల్లా అధ్యక్షుడు ఎవరనేది ప్రకటించనున్నారు.

తొమ్మిది నెలలే అధ్యక్ష పదవి..

అయితే ఈసారి చాంబర్ అధ్యక్ష పదవి సుమారు తొమ్మిది నెలలే ఉంటుందని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. చాంబర్ నిబంధనల ప్రకారం ప్రతి ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ లోగా ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే ఈసారి జరగలేదు. చాంబర్ భవన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఎన్నికలు నిర్వర్తించలేకపోతున్నట్లు హైదరాబాద్‌లోని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌కు సమాచారం ఇచ్చారు. అందుకు వారు సమ్మతించారు. ఇక భవన్‌లో మరమ్మతులు పనులు ముగిశాయని తెలియజేయగా, డిసెంబర్ 28న ఎన్నికలు నిర్వహించడం అనివార్యమైంది. ఇక అధ్యక్ష పదవి గెలిచిన ఈసారికి సుమారు తొమ్మిది నెలలకే సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

మర్యాద పూర్వక కలయిక



సజ్జలను సత్కరిస్తున్న ఆతుకూరి, పక్కన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, అంబటి, పిన్నెల్లి, మేరుగ, డైమండ్, నూరిఫాతిమా తదితరులు



అనారోగ్యంతో ఉన్న మోదుగుల పాపిరెడ్డిని పరామర్శిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఆతుకూరి ఆంజనేయులను పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బ్రాడీపేటలోని ఆయన నివాసానికి వెళ్లారు. పార్టీలో అత్యంత సీనియర్ నేత, చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు ఆతుకూరిని కలసి కొద్దిసేపు ముచ్చటించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేసిన నేతగా ఆయన్ని కలిసి పార్టీ అంశాలపై చర్చించారు. అనంతరం సజ్జలను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు– నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ మంత్రి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డెప్యూటీ మేయర్, పార్టీ నగర అధ్యక్షులు వనమా బాలవజ్రబాబు (డైమండ్), తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు నిమ్మకాయల రాజనారాయణ, షేక్ మస్తాన్‌వలి, మందపాటి శేషగిరిరావు, పార్టీ నేతలు బైరెడ్డి రవీంద్రారెడ్డి, బత్తుల దేవానంద్, ముత్యాలరాజు పాల్గొన్నారు.

మోదుగుల నివాసానికి వెళ్లిన సజ్జల

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మంగళవారం రెడ్డిపాలెంలోని పార్టీ గుంటూరు, పల్నాడు జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి నివాసానికి విచ్చేశారు. జిల్లా జైలులో ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పరామర్శించిన సజ్జల, మోదుగుల నివాసానికి వెళ్లారు. ఇటీవల అనారోగ్యానికి గురైన మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి తండ్రి పాపిరెడ్డి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్లఅప్పిరెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డిప్యూటీ మేయర్, పార్టీ నగర అధ్యక్షులు వనమా బాలవజ్రబాబు (డైమండ్), పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా, పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు మందపాటి శేషగిరిరావు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విఘ్నేశ్వరుడు, యమధర్మరాజు వేషధారణలో ఉన్న వ్యక్తులు

పట్నంబజారు: హెల్మెట్ అవగాహనపై పోలీసు అధికారులు నిత్యం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా నిత్యం ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వినూత్న రీతిలో ముందుకు సాగుతున్నారు. దానిలో భాగంగానే గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయం వద్ద వినూత్న కార్యక్రమం చేపట్టారు. విఘ్నేశ్వర స్వామి అవతారంలో ఓ వ్యక్తి, యమ ధర్మరాజు వేషధారణలో మరో వ్యక్తి కలిసి ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులను నిలువరించి హెల్మెట్ ధరించిన వారికి విఘ్నేశ్వర స్వామి వేషధారణ ఉన్న వ్యక్తి ద్వారా ఆశీర్వాదం ఇప్పించారు. హెల్మెట్ లేని వ్యక్తులు యమధర్మరాజు వేషధారణలో ఉన్న వ్యక్తితో హెల్మెట్ లేకుంటే జరిగే పరిణామాలు వివరించారు. సీఐ సింగయ్య మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణ గురించి వివరించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. దానిలో భాగంగా విఘ్నేశ్వరుడు, యమధర్మరాజు వేషధారణలతో ప్రజలకు హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే నష్టాలు, ధరించడం వల్ల జరిగే మంచిని వివరిస్తున్నామని పేర్కొన్నారు. విస్తృత తనిఖీలు చేపట్టి భారీ ఎత్తున జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో కూడా తనిఖీలు నిర్వహించి, ప్రజల్లో చైతన్యం కలిగించే దిశగా ముందుకు సాగుతామని వివరించారు.

పాఠశాలల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు



కెనడీ స్కూల్లో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ ఐజాక్‌కుమార్



పాటిబండ్ల సీతారామయ్య స్కూల్‌లో క్రీస్తు జనన రూపకం



కేఎల్‌పీ స్కూల్ సెమీ క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని కెనడీ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల క్రీస్తు జననం రూపకంతో పాటు క్రిస్మస్ గేయాలు, నృత్య ప్రదర్శన, గీతాలాపనతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య, ప్రిన్సిపాల్ ఎస్.ఐజాక్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాజేంద్రనగర్‌లోని కెనడీ నెక్స్‌జెన్ కిడ్స్ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు క్రీస్తు జనన వృత్తాంతాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీఎల్ హేమలత పాల్గొన్నారు.

సీతారామయ్య స్కూల్లో..

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాలలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు అలరించాయి. ఈసందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు శాంతాక్లాజ్, దైవదూతల వేషధారణలో క్రీస్తు జనన ప్రదర్శన, ప్రేమ, కరుణా తత్వాన్ని పెంపొందించే క్రీస్తు సందేశాత్మక నాటికలు, సంగీతా వాయిద్యం, గీతాలాపన, శాంతాక్లాజ్ వేషధారణ, బోధన, బోధనేతర సిబ్బందికి సీక్రెట్ శాంతాగా మారి ఒకరికొకరు బహుమతులు ఇచ్చిపుచ్చుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాలక వర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్స్ జంపని పద్మజ, కర్లపూడి పార్వతీదేవి, కో–ఆర్డినేటర్లు దుర్గాశ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.



శ్రీపూజిత స్కూల్ సెమీ క్రిస్మస్ వేడుకలు

కేఎల్‌పీ స్కూల్లో..

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు క్రీస్తు జనన రూపకాన్ని ప్రదర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ శాంతి, ప్రేమ కలయికతో క్రిస్మస్ సందేశాన్ని క్రీస్తు అందించారని, విద్యార్థులు మానవత్వంతో ఎదిగేందుకు ఈ లక్షణాలు దోహద పడతాయన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, ఏఓ కె. వెంకట్రావు పాల్గొన్నారు. ఈసందర్భంగా పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె. బసవ పున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీపూజిత స్కూల్లో..

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని శ్రీపూజిత పబ్లిక్ స్కూల్లో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులు క్రీస్తు జనన రూపకాన్ని ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి మాట్లాడుతూ భూమిపై మనిషిగా జన్మించిన యేసుక్రీస్తు శాంతి, సహనం, త్యాగాన్ని మానవాళికి అందించారని అన్నారు.

గుంటూరు ఎడ్యుకేషన్: శ్యామలానగర్‌లోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో డాన్‌బాస్కో చర్చి ఫాదర్ లూయిస్, లైజు థమస్, పాఠశాల అధినేత కేవీ సెబాస్టియన్, కరస్పాండెంట మంజు పాల్గొన్నారు.

- స్తంభాలగరువులోని నారాయణ స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏజీఎం జానకి రామిరెడ్డి, ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- అమరావతిరోడ్డులోని ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించిన వేడుకల్లో పాస్టర్ మాతన రామారావు పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో పాఠశాల రీజనల్ ఇన్‌చార్జి సుందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వ్యభిచార గృహనిర్వాహకుడి అరెస్టు

పట్నంబజారు: వ్యభిచార గృహం నడుపుతున్న నిర్వాహకుడితో పాటు, ముగ్గురు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకాష్‌నగర్‌లోని ఓ నివాసంలో రామారావు అనే వ్యక్తి మహిళలతో వ్యభిచారం చేయిస్తున్నాడన్న పక్కా సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి నిర్వాహకుడితో పాటు, ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.